

హెచ్‌పీఎస్ స్టార్ట్ ఎక్స్ ఆంత్రప్రెన్యూర్‌షిప్ సమిట్‌లో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

# డిజిటల్ ఇన్‌ఫ్రాతోనే భవిష్యత్తు

- ఆంత్రప్రెన్యూర్‌షిప్‌లో ఇదే కీలకం
- హెచ్‌పీఎస్‌లో యువ ఆంత్రపెన్యూర్లకు పూర్వ విద్యార్థుల మార్గనిర్దేశం

హైదరాబాద్ సిటీబ్యూరో, డిసెంబర్ 25 (నమస్తే తెలంగాణ): ఉబెర్, స్విగ్గీ వంటి సంస్థలు అభివృద్ధి చెందటంలో అధునాతన జీపీఎస్, ఇంటర్నెట్ సౌకర్యాలే ముఖ్య భూమిక పోషించాయని స్విగ్గీ కో ఫౌండర్ నందన్‌రెడ్డి చెప్పారు. ఆంత్రప్రెన్యూర్‌షిప్‌లో డిజిటల్ ఇన్‌ఫ్రా ముఖ్య భూమిక పోషిస్తుందని తెలిపారు. హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ శతాబ్ది వేడుకల్లో భాగంగా హెచ్‌పీఎస్ స్టార్ట్ ఎక్స్ ఆంత్రప్రెన్యూర్‌షిప్ సమిట్‌ను నిర్వహించారు. యువ వ్యాపారవేత్తలకు అవగాహన కల్పించటం కోసం ఇంటరాక్షన్ సెషన్ ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథులుగా స్విగ్గీ కో ఫౌండర్ నందన్‌రెడ్డి, జీవీకే గ్రూప్ వైస్ చైర్మన్ సంజయ్‌రెడ్డి, ప్రోక్టర్ సీవోవో శైలేశ్ జేజూరికర్‌తోపాటు, నాసా చీఫ్ ఇంజనీర్ సతీశ్‌రెడ్డి, కేఎస్ ఆటో మోషన్ ఈడీ సుబ్రం కపూర్, ఎఫ్‌వీసీ ఎండీ కేఎస్ పరాగ్‌తోపాటు పలువురు టెక్ నిపుణులు, వ్యవస్థాపకులు, డైరెక్టర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్విగ్గీ కో ఫౌండర్ మాట్లాడుతూ.. కంపెనీలను స్థాపించడానికి మెరుగైన మౌలిక వసతులు అవసరమని అన్నారు. వినూత్న ఆలోచన విధానాలను అలవరుచుకోవాలని సూచించారు. ఇన్నేండ్లు ఫుడ్ డెలివరీపై దృష్టి సారించిన తాము ఇకపై లావాదేవీలను మరింత సులభతరం చేయడంపై దృష్టి సారించామని వివరించారు. దేశంలో హెల్త్ కేర్, ఏఐ రంగాలకు పుష్కలమైన మానవ వనరుల అవసరం ఉన్నదని వెల్లడించారు. ఏఐ, చాట్ జీపీటీ ప్రస్తుతం ఎమర్జింగ్ టెక్నాలజీగా మారిపోయాయని కేఎస్ పరాగ్ అన్నారు. వెంచర్ క్యాపిటలిస్టుల సాయంతో పారిశ్రామిక రంగంలో అడుగుపెట్టడం మరింత సులభమైందని హెచ్‌పీఎస్ సొసైటీ ప్రెసిడెంట్ గుస్తీ నోరియా అన్నారు. శతాబ్ది వేడుకల్లో భాగంగా ఉదయం నుంచి రాత్రి 8 గంటల వరకు పలు కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో పూర్వ విద్యార్థులు స్థాపించిన 30 స్టార్టప్‌లను ప్రదర్శించారు. వింటేజ్ కార్ల ప్రదర్శన ఎంతగానో ఆకట్టుకున్నది. పూర్వవిద్యార్థులు, విద్యార్థులు కలిసి కార్నివాల్‌లో సందడి చేశారు. వేడుకల్లో భాగంగా అల్యూమ్నీతో విద్యార్థులకు ఇంటరాక్షన్ సెషన్ ఏర్పాటు చేయనున్నారు. తెలుగు సినీ ప్రముఖులు దగ్గుబాటి రానా, డైరెక్టర్ నాగ్‌అశ్విన్ తదితరులు పాల్గొననున్నారు. స్పోర్ట్స్ కార్ల ప్రదర్శన, సూపర్ కార్ షోను నిర్వహించనున్నారు.


# గ్రూప్-2 వాయిదా?

> మొదటిపేజీ తరువాయి...

ఫిబ్రవరి 16 వరకు దరఖాస్తులు స్వీకరించారు. రాష్ట్రస్థాయిలో గ్రూప్-1 తర్వాత అత్యంత కీలకమైనది గ్రూప్ -2 ఉద్యోగమే కావడంతో 5,51,943 మంది దరఖాస్తు చేశారు. సగటున ఒక్కో ఉద్యోగానికి 705 మంది పోటీ పడుతున్నారు. తొలుత ఆగస్టు 29, 30వ తేదీల్లో గ్రూప్-2 పరీక్ష నిర్వహించేందుకు కమిషన్ షెడ్యూల్ ప్రకటించింది. అభ్యర్థుల నుంచి వచ్చిన డిమాండ్ మేరకు నవంబరు 2, 3వ తేదీలకు పరీక్షను రీషెడ్యూల్ చేశారు. నవంబర్ 1 నుంచి ఎన్నికల ప్రక్రియ ప్రారంభంకావడంతో పరీక్షల నిర్వహణ, శాంతిభద్రతలు, వసతులు, సిబ్బంది అన్నీ ఇబ్బంది అయ్యే అవకాశం ఉన్నదని కలెక్టర్లు టీఎస్‌పీఎస్సీ దృష్టికి తెచ్చారు. అన్నీ ఆలోచించిన టీఎస్‌పీఎస్సీ... తప్పని పరిస్థితుల్లో రెండోసారి గ్రూప్-2 పరీక్షను వాయిదా వేస్తున్నట్టు ప్రకటించింది. గ్రూప్-2 పరీక్షలను మళ్లీ 2024 జనవరి 6, 7 తేదీలకు రీషెడ్యూల్ చేసింది. ఇప్పటికే రెండుసార్లు పరీక్షలు రీషెడ్యూల్ కాగా.. మూడోసారి ఈ పరీక్షల నిర్వహణపై ఇంతవరకు కమిషన్ నుంచి నిర్ణయం వెలువడలేదు. టీఎస్‌పీఎస్సీ స్వయంప్రతిపత్తి కలిగిన సంస్థ కావడంతో పరీక్షలపై నిర్ణయాధికారం కమిషన్‌కే ఉంటుంది. ఈమేరకు కమిషన్ నిర్ణయం తీసుకోవాలని ఇటీవల ప్రభుత్వం స్పష్టం చేసింది. అయినప్పటికీ టీఎస్‌పీఎస్సీ నుంచి అధికారికంగా ఎలాంటి ప్రకటన వెలువడకున్నా.. పరీక్షను వాయిదా వేయాలని ఇప్పటికే నిర్ణయించినట్టు సమాచారం.

### పరీక్షకు మిగిలింది మరో పది రోజులే!

గ్రూప్-2 పరీక్షకు మరో 10 రోజుల సమయం మాత్రమే మిగిలి ఉన్నది. పరీక్షకు ఏర్పాట్లు జరుగుతున్నాయని, కలెక్టర్లతో సమీక్షలు చేస్తున్నారని ఒకవైపు ప్రచారం జరుగుతుంటే, పరీక్షను వాయిదా వేస్తున్నారని మరోవైపు వినిపిస్తున్నది. ఈ నేపథ్యంలో గ్రూప్-2 జరుగుతుందా? మూడోసారి మళ్లీ వాయిదా వేస్తారా? అనే దానిపై అభ్యర్థుల్లో సందిగ్ధత నెలకొన్నది. పరీక్ష దగ్గరపడుతుంటే సీరియస్‌గా ప్రిపరేషన్ కొనసాగించాల్సిన సమయంలో ఇదో పెద్ద తలనొప్పిగా మారిందని అభ్యర్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రూప్-2 పరీక్ష యథావిధిగా కొనసాగుతుందో? లేక వాయిదా వేస్తున్నారో? టీఎస్‌పీఎస్సీ స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు.



### కమిషన్ కొనసాగింపు అనివార్యం

టీఎస్‌పీఎస్సీకి సంబంధించిన ఒక ఉద్యోగ ప్రకటన ఇవ్వాలన్నా లేదా పరీక్ష నిర్వహించాలన్నా.. ఏదైనా ప్రత్యేక పరిస్థితుల్లో పరీక్షను వాయిదా వేయాలన్నా ఆ అధికారం కమిషన్ బోర్డుకే ఉంటుంది. కమిషన్ బోర్డు తీసుకున్న నిర్ణయాలను టీఎస్‌పీఎస్సీ కార్యదర్శి అమలు చేస్తారు. కార్యదర్శి ఆదేశాలతో కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ పరీక్షలకు ఏర్పాట్లు చేస్తుంది. ప్రస్తుతం టీఎస్‌పీఎస్సీలో అయోమయ పరిస్థితులు నెలకొన్నాయి. ఇటీవలే.. టీఎస్‌పీఎస్సీ చైర్మన్ బీ జనార్దన్‌రెడ్డి రాజీనామా చేశారు. ఆయన బాటలోనే మరో ముగ్గురు సభ్యులు గవర్నర్‌కు రాజీనామాలు పంపారు. చైర్మన్, ముగ్గురు సభ్యుల రాజీనామాలను గవర్నర్ ఇంకా ఆమోదించలేదు. అయినప్పటికీ చైర్మన్‌తోపాటు మిగిలిన ముగ్గురు సభ్యులు కమిషన్ కార్యాలయానికి రావడం లేదు. ప్రస్తుతం టీఎస్‌పీఎస్సీ సభ్యులుగా అరుణకుమారి, సుమిత్రా ఆనంద్ తనోబా మాత్రమే ఉన్నారు. ఈ నేపథ్యంలో టీఎస్‌పీఎస్సీ పరీక్షలను నిర్వహించాలన్నా.. కొత్త నోటిఫికేషన్లు ఇవ్వాలన్నా.. కమిషన్ కొనసాగింపు అనివార్యం. లేదా నూతన బోర్డు ఏర్పాటు అత్యవసరం. కొత్త బోర్డు ఏర్పాటుకు ఆలస్యం అవుతుందని భావిస్తే.. ఈలోపే అరుణకుమారి, సుమిత్రా ఆనంద్‌లలో సీనియర్ సభ్యురాలికి ఒకరికి యాక్టింగ్ చైర్మన్ బాధ్యతలు అప్పగించి పరీక్షలపై నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. ఈ క్రమంలో టీఎస్‌పీఎస్సీ ప్రస్తుత కమిషన్‌నే కొనసాగిస్తారా? లేదంటే.. కొత్త కమిషన్ బోర్డును నియమిస్తారా? లేక ఉన్నవారిలోనే సీనియర్‌కు తాత్కాలిక బాధ్యతలు అప్పగిస్తారా? అనే విషయంలో సందిగ్ధత నెలకొన్నది.

## విద్యా - ఉద్యోగ సమాచారం

### గురుకుల ఉపాధ్యాయుల విభాగం కార్యవర్గం ఎన్నిక

హైదరాబాద్, డిసెంబర్ 25 (నమస్తే తెలంగాణ) : గురుకుల ఉపాధ్యాయుల విభాగం (యూటీఎఫ్ అనుబంధం) రాష్ట్ర అధ్యక్షుడిగా డాక్టర్ బీ సురేందర్, ప్రధాన కార్యదర్శిగా వీ హరీందర్‌రెడ్డి ఎన్నికయ్యారు. సోమవారం హైదరాబాద్‌లో నిర్వహించిన సమావేశంలో ఈ ఎన్నిక జరిగింది. కోశాధికారిగా ఎస్ రవికుమార్, మరో 15 మంది కార్యవర్గ సభ్యులను ఎన్నుకొన్నారు. గురుకుల టీచర్ల బదిలీలు, పదోన్నతులను చేపట్టాలని ఈ సందర్భంగా నూతన కార్యవర్గం ప్రభుత్వాన్ని కోరింది. సమావేశంలో సంఘం నేతలు గణేశ్, ఈశ్వర్, ఉపేందర్, డీ వెంకన్న, పావని, నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### ఏఐఎస్‌బీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా హకీమ్ నవీద్

హైదరాబాద్, డిసెంబర్ 25 (నమస్తే తెలంగాణ) : ఆల్ ఇండియా స్టూడెంట్ బ్లాక్ (ఏఐఎస్‌బీ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా హకీమ్ నవీద్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం రాష్ట్ర నూతన కమిటీ ఎన్నికైంది. రాష్ట్ర చైర్మన్‌గా జవరే రాహుల్, వైస్‌చైర్మన్లుగా అతికం రాజశేఖర్‌గౌడ్, దేవర్ల నాగరాజు, జాయింట్ సెక్రటరీలుగా ఎద్దు ప్రవీణ్ కుమార్, పుల్లని వేణు, కోశాధికారిగా రోహిత్‌లను ఎన్నుకొన్నారు.

### 3 నుంచి గ్రాడ్యుయేట్ ఆప్టిట్యూడ్ టెస్ట్ అడ్మిట్‌కార్డులు

హైదరాబాద్, డిసెంబర్ 25 (నమస్తే తెలంగాణ) : గ్రాడ్యుయేట్ ఆప్టిట్యూడ్ టెస్ట్ (గేట్) అడ్మిట్‌కార్డులు 2024 జనవరి 3న విడుదలకానున్నాయి. దేశవ్యాప్తంగా ఉన్న ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థల్లో ప్రవేశాల నిమిత్తం గేట్ పరీక్షను ఫిబ్రవరి 3, 4, 10, 11 తేదీల్లో నిర్వహించనున్నారు. మొత్తం 9 లక్షలకుపైగా అభ్యర్థులు గేట్‌కు దరఖాస్తు చేసుకొన్నారు. నిరుడుతో పోల్చితే ఈసారి గేట్‌కు 25శాతం అధికంగా దరఖాస్తులొచ్చాయి.

# ఐఐఎంలలో తగ్గుతున్న ఎస్టీల నమోదు

- గత ఐదేండ్లుగా పడిపోతున్న అడ్మిషన్లు
- ఎస్సీలది కూడా అదే పరిస్థితి

హైదరాబాద్, డిసెంబర్ 25 (నమస్తే తెలంగాణ) : ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఐఐఎం)లలో ఎస్టీ విద్యార్థుల సంఖ్య తగ్గుతున్నది. వీటిల్లో చేరుతున్న వారి సంఖ్య ఏటా పడిపోతున్నది. ఐదేండ్లుగా ఎస్టీ వర్గాల విద్యార్థులు వీటివైపు చూడటం లేదు. ఎస్సీ విద్యార్థులదీ అదే పరిస్థితి కావడం గమనార్హం. 2017 -18లో ఎస్టీల నమోదు 8.07 శాతముంటే, 2022 -23కు వచ్చేసరికి 5.90శాతానికి తగ్గింది. ఎస్సీల నమోదు 2017 -18లో 14.58 శాతముంటే మధ్యలో 15 శాతానికి చేరి ఆ తర్వాత 14.88శాతానికి పరిమితమైంది. అయితే, నమోదు విషయంలో ఎస్సీ విద్యార్థుల పరిస్థితి కాస్త ఆశాజనకంగా ఉండటం విశేషం. ఆసక్తికరమైన ఈ విషయాలు కేంద్ర విద్యాశాఖ వెల్లడించిన వార్షిక నివేదికలో వెలుగుచూశాయి. దేశంలో 20 ఐఐఎంలుండగా.. 2022 -24 విద్యాసంవత్సరానికి దేశంలోని అన్ని ఐఐఎంలలో 1,082 మంది ఎస్సీ, 429 మంది ఎస్టీలు అడ్మిషన్లు తీసుకొన్నారు. ఐఐఎంలో ప్రవేశాలకు నిర్వహించే క్యాట్ ఫలితాలు గురువారం విడుదలయ్యాయి. త్వరలోనే అడ్మిషన్లు ప్రారంభంకానున్నాయి. మొత్తం సీట్లతో 15శాతం ఎస్సీలకు, 7.5శాతం సీట్లను ఎస్టీలకు రిజర్వ్‌చేస్తారు. అయితే ఒక్క 2021-22విద్యాసంవత్సరంలోనే కోటాకు మించి ఎస్సీ విద్యార్థులు ఐఐఎంలో అడ్మిషన్లు పొందారు. ఇక ఎస్టీల అడ్మిషన్లను పరిశీలిస్తే ఒక్క 2017 -18 మినహా గత ఆరు విద్యాసంవత్సరాల్లో ఎప్పుడు కూడా మొత్తం 7.5 శాతం ఎస్టీల సీట్లు భర్తీకాలేదు. ఐఐఎంలు అందుబాటులో లేకపోవడం, క్యాట్ పరీక్ష అత్యంత కఠినంగా ఉండటంతోనే రిజర్వేషన్ క్యాటగిరీ విద్యార్థులు అవకాశాలను అందిపుచ్చుకోలేకపోతున్నారు. ఇక భాషా సమస్య, కార్పొరేట్ కొలువుల పట్ల ఆసక్తి లేకపోవడంతోనే ఈ పరిస్థితి నెలకొంటుందన్న వాదనలున్నాయి.

**ఐఐఎంలో ఎస్సీ, ఎస్టీల నమోదుశాతం**

| సంవత్సరం | ఎస్సీలు | ఎస్టీలు |
|---|---|---|
| 2017-18 | 14.58 | 8,.07 |
| 2018-19 | 14.60 | 6.86 |
| 2019-20 | 14.34 | 6.80 |
| 2020-21 | 14.95 | 6.95 |
| 2021-22 | 15.01 | 4.96 |
| 2022 -23 | 14.88 | 5.90 |

# అప్రూవర్‌గా మారుతా.. అనుమతివ్వండి

- కోర్టును ఆశ్రయించిన న్యూస్‌క్లిక్
- హెచ్‌ఆర్ హెడ్ అమిత్ చక్రవర్తి

న్యూఢిల్లీ: చైనా ఏజెంట్ల నిధులతో భారత్ సార్వభౌమాధికారానికి విఘాతం కలిగించారనే కేసులో అప్రూవర్‌గా మారాలని న్యూస్‌క్లిక్ హెచ్‌ఆర్ హెడ్ అమిత్ చక్రవర్తి నిర్ణయించుకున్నారు. ఆయన ఈ మేరకు ఢిల్లీ పాటియాలా హౌస్ కోర్టు స్పెషల్ జడ్జి హర్‌దీప్ కౌర్‌కు దరఖాస్తు చేశారు. తన వద్ద ఉన్న సమాచారాన్ని ఢిల్లీ పోలీసులకు అందజేస్తానని చెప్పారు. ఈ కేసులో ఢిల్లీ పోలీసులు చక్రవర్తి, న్యూస్ క్లిక్ వ్యవస్థాపకుడు ప్రబిర్ పుర్కాయస్థల దర్యాప్తును పూర్తి చేయడానికి గడువును 60 రోజులు పొడిగిస్తూ ఇటీవల కోర్టు ఆదేశాలు ఇచ్చింది. వీరిద్దరినీ పోలీసులు అక్టోబరులో అరెస్టు చేశారు. ఢిల్లీ పోలీసులు, ఈడీ, సీబీఐ ఈ కేసులో వేర్వేరు ఆరోపణలపై దర్యాప్తు చేస్తున్నాయి. చైనా కమ్యూనిస్టు పార్టీ ప్రచార విభాగంతో సత్సంబంధాలున్న నెవిల్లే రాయ్ సింఘమ్ నుంచి న్యూస్‌క్లిక్‌కు రూ.38 కోట్లు వచ్చాయని న్యూయార్క్ టైమ్స్ ప్రచురించడంతో సోదాలు నిర్వహించి, ఈ కేసులను నమోదు చేశారు.

# 25 ఏండ్ల మత్తు దందా గుట్టు రట్టు

- ఆల్ఫ్రాజోలం లింక్‌ను ఛేదించిన టీన్యాబ్
- ఢిల్లీ నుంచి కొరియర్ ద్వారా నగరానికి

హైదరాబాద్ సిటీబ్యూరో, డిసెంబర్ 25 (నమస్తే తెలంగాణ): అత్యంత హానికర డ్రగ్ ఆల్ప్రాజోలం వ్యాపారంతో రూ.కోట్లు కూడగట్టుకున్న డ్రగ్ వ్యాపారి గుట్టు రట్టు చేశారు టీన్యాబ్ పోలీసులు. ఇటీవల ఈ డ్రగ్ సరఫరా చేస్తూ పోలీసులకు పట్టుబడిన సుక్క నర్సింహాగౌడ్, అతడి కొడుకు రాజశేఖర్‌గౌడ్‌ను విచారించగా.. తీగ లాగితే డొంక కదిలినట్టు రాష్ట్రంలో ఆల్ప్రాజోలం గుట్టు బయటపడింది. టీన్యాబ్ డైరెక్టర్ సందీప్ శాండిల్యా కథనం ప్రకారం.. సుక్క నర్సింహాగౌడ్ గత 25 ఏండ్ల నుంచి యథేచ్ఛగా అల్ప్రాజోలం వ్యాపారం నిర్వహిస్తున్నాడు. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి ఇక్కడికి రప్పించి కల్లు డిపోలకు విక్రయిస్తున్నాడు. 1995 నుంచి ఇతడు ఢిల్లీ కేంద్రంగా ఈ డ్రగ్ వ్యాపారం నిర్వహిస్తున్నాడు. ఢిల్లీలోని భాటియా, అతడి కొడుకు ప్రమోద్‌సింగ్ నుంచి దీన్ని కొంటున్నాడు. దాన్ని ఎవరికీ అనుమానం రాకుండా మెట్రో కొరియర్ సర్వీస్ ద్వారా రాష్ట్రానికి తరలిస్తూ, హవాలా ద్వారా డబ్బు చెల్లిస్తున్నాడు. కిలో రూ.2.4 లక్షలకు కొని, రూ.3.5 లక్షలకు విక్రయిస్తున్నాడు. విఠల్‌గౌడ్, అతడి కొడుకు నరేందర్ గౌడ్ నుంచీ నర్సింహాగౌడ్.. ఈ మత్తు పదార్థాన్ని కొనుగోలు చేస్తున్నట్టు విచారణలో తేలింది. ఆల్ప్రాజోలం వ్యాపారంతో నర్సింహాగౌడ్ కుటుంబం కోట్ల రూపాయల ఆస్తులు కూడబెట్టినట్టు టీన్యాబ్ గుర్తించిందని సందీప్ శాండిల్యా తెలిపారు. గచ్చిబౌలిలో రూ.3.5 కోట్ల భవనం, కొండాపూర్‌లో రూ.5.4కోట్ల విలువైన 3 ప్లాట్లు, కొల్లాపూర్‌లో రూ.కోటి విలువ చేసే 9 ఎకరాల వ్యవసాయ భూమి కొన్నట్టు పేర్కొన్నారు.

